# దృష్టి దోషం

-అరసూర్ శ్యామసుందర్




కోడిగుడ్డు రోడ్డు మీద పడితే మరుక్షణం ఆమ్లెట్ అయ్యేలా వుంది ఎండ. ఎడారిలో ఒయాసిస్సులా వుంది ఆ అయిస్‌క్రీమ్ పార్లర్.

కౌంటర్ దగ్గర కూర్చుని రూపాయిలు లెక్కపెట్టుకుంటున్నాడు వినయ్.

"దొరా! పైసల్ తెచ్చిన దొరా" అన్న మాటలు విని తలెత్తి చూశాడు వినయ్.

పదేళ్ళ కుర్రాడు. మాసిపోయిన తల, వెలసిపోయిన చొక్కా, జారుతున్న నిక్కరు,

"పైసల్ తెచ్చిన దొరా! గది కావలె" అన్నాడు మళ్ళీ, వేలితో గోడ మీద వున్న అయిస్‌క్రీమ్ బొమ్మ చూపిస్తూ.

"డబ్బులిటియ్యి" అన్నాడు వినయ్.

వాడు భద్రంగా జేబులో పొట్లం కట్టిన చిల్లర తీసిచ్చాడు. అన్నీ పది పైసలు, పావలా బిళ్ళలే. లెక్కబెడితే పది రూపాయిలకు పది పైసలు తక్కువ వచ్చింది.

"పది పైసలు తక్కువవున్నాయి" అన్నాడు వినయ్ విసుగ్గా.

"సరిగ్గానే వున్నాయి దొరా. నేను ఎంచి తెచ్చిన" అన్నాడు వాడు.

"తక్కువున్నాయి అని చెబితే నీక్కాదూ. పది పైసలు పట్టుకురా పో"

"తక్కువుంటే మల్లా అప్పటికిస్తా దొరా. గది ఇచ్చెయ్యి" అన్నాడు వాడు ప్రాధేయపడుతూ. వాడికి తండ్రి ఎక్కడొస్తాడోనని భయం. తండ్రి వచ్చేలోగా ఆ ఐస్‌క్రీమ్ తినెయ్యాలి. ఖరీదైన ఆ ఐస్‌క్రీమ్ తినాలని వాడికెప్పటినుంచో కోరిక. తండ్రి నడిగితే పది రూపాయిలకు అయిదు కిలోల బియ్యం వస్తది. ఇంకోసారి అడిగితే మక్కెలిరగ తంతానని బెదిరించాడు.

తండ్రి లేనప్పుడు గిరాకీల నుంచి అయిదు, పది పోగేసి ఇప్పటికి పది రూపాయిలు చేశాడు వాడు.

"నీ మొహానికి అరువు కూడానా. ముందు డబ్బులు పట్టుకురాపో" అని కసిరాడు వినయ్.

ఇంతలో ఒక మారుతి కారు వచ్చి ఆగింది. పార్లర్ ముందు బటర్‌ఫ్లైస్‌లా వున్న నలుగురు అమ్మాయిలు దిగారు.

"నడు, నడు, ఈ డబ్బులు పట్టుకెళ్ళు" అని వాడిని గెంటాడు వినయ్.

కళ్ళ నీళ్ళు తిరుగుతుండగా మొహం వంచుకుని వెళ్ళిపోయాడు వాడు.

"రండి మేడమ్. రండి" నవ్వు పులుముకుని ఆహ్వానించాడు వాళ్ళను. కిలకిలా నవ్వుతూ లోపలికి వచ్చి కూర్చున్నారు. నాలుగు కసాటా, నాలుగు మలై కుల్ఫీలు ఆర్డరిచ్చింది వాళ్ళల్లో లీడర్‌గా కనబడే అమ్మాయి. ఆ అమ్మాయి జుట్టు విరబోసుకుని బ్లాక్ గాగుల్స్, బ్లూకలర్ జీన్స్, వైట్‌షర్ట్‌తో మోడరన్‌గా వుంది.

వాళ్ళు అడిగినవి నీట్‌గా సర్వ్ చేసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు వినయ్. అన్నీ తినేసిన తరువాత 'మా మమ్మీకిష్టం' 'మా డాడీ కిష్టం' అని మరికొన్ని ఫామిలి ప్యాక్‌లు ప్యాక్ చేయించింది ఆ అమ్మాయి.

బిల్లు నాలుగు వందల డెబ్భై అయింది.

ఆనందంగా బిల్లును సాసర్‌లో వుంచాడు వినయ్ వాళ్ళ ముందు.

ఆ అమ్మాయి బిల్లును చూడగానే తేలు కుట్టినట్టు అరుస్తూ "మైగాడ్! నేను పర్స్ తేలేదు. ఇప్పుడెలా?" అన్నది.

వినయ్ వింతగా చూశాడు ఆ అమ్మాయిని.

"డోంట్ వర్రీ యార్. బిల్లు నేనిస్తాగా" అన్నది ఇంకో అమ్మాయి.

"మిస్టర్ నువ్వు మాతోపాటు రా. నేను పర్స్ తీసుకురాలేదు. మా ఇంటి దగ్గర బిల్ పే చేస్తాను. ఈ పార్సిల్ కారులో పెట్టు" అన్నది.

కంగారుగా చూశాడు వినయ్. తను వీళ్ళతో వెళ్ళాలంటే షాపు మూసేసి వెళ్ళాలి. ఆ సంగతే చెప్పాడు.

బ్యాక్ పాకెట్ నుంచి విజిటింగ్ కార్డ్ తీసిస్తూ "చూడు మా నాన్నగారు ఫేమస్ కాంట్రాక్టర్. ఇది పట్టుకొచ్చి డబ్బులు పట్టుకెళ్ళు. లేకపోతే రేపు ఎప్పుడైనా ఇటువైపు వచ్చినప్పుడు నేనే ఇస్తాను" అన్నది. విలాసంగా కారు కీ చైన్ తిప్పుతున్న ఆ ఖరీదైన అమ్మాయితో ఈ చిన్న బిల్లు గురించి తేలిక పడకూడదనుకున్నాడు.

"బిల్లుదేముంది మేడమ్. మీలాంటి వారు మా పార్లర్‌కి ఎప్పుడూ రావాలన్నదే మా కోరిక" అంటూ పార్సిల్ తీసుకెళ్ళి కారులో పెట్టాడు. కిలకిలాడుతూ వెళ్ళిపోయారు వాళ్ళు.

ఖరీదైన కస్టమర్ దొరికినందుకు ఆనందిస్తున్న వినయ్‌తో

"ఏరా ఎవరొచ్చారు ఆ కార్లో? కొంపదీసి ఆ అమ్మాయి కాదు కదా?" అన్నాడు అప్పుడే వచ్చిన వినయ్ నాన్నగారు స్కూటర్ పార్క్ చేస్తూ.

జరిగింది చెప్పాడు వినయ్ విజిటింగ్ కార్డు చూపిస్తూ.

"అయ్యో! ఎంత పని చేశావురా?! ఆ అమ్మాయి తిక్కమేళం అంటే వాళ్ళ నాన్న ఒక వెర్రి మేళం. అదేం బుద్ధోగాని మన బిల్లు ఎగ్గొడుతుంది చూడు. అంత డబ్బుండి ఇదేం పరదానో. ఒకసారి ఇలాగే నా దగ్గర ఏదో చెప్పి అప్పు పట్టికెళ్ళింది. ఆరొందల బిల్లు!" అన్నాడు బాధగా.

వినయ్‌కి ఆ అమ్మాయి ముఖం, చెప్పులు కుట్టే కుర్రాడి ముఖం మార్చి మార్చి కనబడసాగాయి..